www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 మార్చి 2023

ఇంటర్ పరీక్షలో ఇద్దరు డీబార్

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-కడప అర్బన్

శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలో పులివెందులలోని వేర్వేరు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారు. రాయచోటిలో పరీక్ష కేంద్రాలను విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 20,369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 19,934 విద్యార్థులు హాజరయ్యారు. 705 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులు రవిశంకర్ నాయక్ పోరుమామిళ్లలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వృత్తి విద్యాధికారి శ్రీనివాసులురెడ్డి బద్వేలులోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐఒ రమణ రాజు నగరంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

టిడిపికే 'పట్టం'

- పట్టభద్ర ఎమ్మెల్సీగా రామ్‌గోపాల్‌రెడ్డి ఎన్నిక
- 'వెన్నపూస'తో హోరాహోరీ పోరు
- 7,543 ఓట్ల మెజార్టీతో విజయం
- పిడిఎఫ్ ఓట్లతోనే గెలుపుబాట
- టిడిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీగా టిడిపి మద్దతుదారు భూమిరెడ్డి రామ్ గోపాల్‌రెడ్డి గెలుపొందారు. మూడ్రోజులుగా అనంతపురం జెఎన్‌టియులో చేపట్టిన కౌంటింగ్‌లో తన సమీప ప్రత్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి నుంచి ఎదురైన ఉత్కంఠ భరిత పోరులో 7,543 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 49 మంది అభ్యర్థులు నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, వెన్నపూస రవీం ద్రారెడ్డి మధ్య హోరాహోరీగా చివరి వరకు పోరు నడిచింది. వీరిలో ఎవరికీ 50 శాతం ఓట్లు లభించని నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్య ఓటును లెక్కించాల్సి వచ్చింది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,513 ఓట్లు పోలు కాగా, 19,108 చెల్లని ఓట్లుగా తేలినట్లు సమాచారం. పోలైన 2,26,405 ఓట్లలో అధికార వైసిపి మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డికి 1,02, 238 ఓట్లు రాగా, టిడిపి మద్దతుదారు రామ్ గోపాల్‌రెడ్డికి 1,09,781 ఓట్లు రావడం గమనార్హం. 7,543 ఓట్ల మెజార్టీతో టిడిపి మద్దతుదారు రామ్ గోపాల్‌రెడ్డి గెలుపొందారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర నుంచి ఎన్నికల ప్రచారం, కౌంటింగ్ దశల వరకు ప్రత్యర్థుల నుంచి తీవ్ర ప్రతి ఘటన ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పరిశీలన, ఉపసంహరణ దశల అనంతరం హోరాహోరీగా తలపడాల్సి వచ్చింది. రామ్‌గోపాల్‌రెడ్డి, వైసిపి మద్దతుదారు వెన్న పూస రవీంద్రారెడ్డి, పిడిఎఫ్ మద్దతుదారు పోతుల నాగరాజు నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. కౌంటింగ్ దశలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనూ పిడిఎఫ్ ఓటర్ల మద్దతుతోనే టిడిపి మద్ద తుదారు గెలిచినట్లు తెలుస్తోంది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మిగిలిన అభ్యర్థి ఓట్ల లెక్కింపు వరకు ఆధిక్యం చేతుల మారుతూ వచ్చింది. పిడిఎఫ్ ఓట్లు లెక్కి ంపు దగ్గర నుంచి రామ్‌గోపాల్‌రెడ్డిలో విజయం పట్ల ధీమా ఏర్పడింది. పిడిఎఫ్ ఓట్ల లెక్కిం పునకు ముందు దశ వరకు ఆధిక్యం చేతులు మారు తూ రావడంతో ఊపిరి బిగబట్టుకుని నిరీక్షించాల్సి వచ్చింది. పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నట్లు టిడిపి అధ్యక్షులు ప్రకటించడం ప్రతిపక్ష టిడిపి తరపున నిలిచిన అభ్యర్థులకు ఊహించిన వరంలా మారిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇదేతరహా పరిస్థితి తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపుల్లో పిడిఎఫ్ ఓట్లు ప్రతిఫలించడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా టిడిపి మద్ద తుదారు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి పిడిఎఫ్ ఓట్ల దన్నుతో గెలుపొందిన నేపథ్యంలో అధికార వైసిపి పొత్తులు, ఎత్తుల వ్యూ హాల పట్ల అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

పులివెందులలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పాఠశాల తనిఖీలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని విద్యార్థులకు విద్య సక్రమంగా అందించాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రాయచోటిలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలించి పనులు ఆలస్యంగా చేస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాయచోటిలోన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి నేరుగా నాలుగో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన పాఠ్యాంశంలోని కొన్ని ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానం రాబట్టారు. సిలబస్ పూర్తికాకుండా ఫార్మేటివ్ 4 పరీక్షను విద్యార్థులు ఎలా రాస్తారని, సిలబస్ పూర్తి చేయనందుకు ఉపాధ్యాయుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. క్లాస్ టీచర్ విద్యార్థులకు సకాలంలో విద్యాబోధన పూర్తి చేశారా లేదా విషయాన్ని హెచ్ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ ఎందుకు పర్యవేక్షణ చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సొంత బిడ్డల్లా చూసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యాయులు, హెచ్ఎం, ఎంఇఒ, డిప్యూటీ డిఇఒలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి వర్క్ బుక్స్ అందిస్తే వినియోగించరా? ఉపాధ్యాయుకు బాధ్యత లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంస్కరణలు ప్రభుత్వం తీసుకువస్తోందని పేర్కొన్నారు. విద్యకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు, ఉపాధ్యాయులు కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రాయచోటి కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నిల్వ ఉంచిన కోడిగుడ్లు, చిక్కిల్లో క్వాలిటీ, ఎక్స్పైరీ డేట్‌లను పరిశీలించారు. విద్యార్థులకు కోడిగుడ్లను సకాలంలో అందించకపోవడం గమనించడంతో ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతివారం మధ్యాహ్నం జగనన్న గోరుముద్దను పరిశీలించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, తీరు తెన్నులు పరిశీలించి స్వయంగా విద్యార్థికి గోరుముద్దను తినిపించి రుచి చూశారు. ఈ తనిఖీలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఇఒ పురుషోత్తం, డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి, ఎంఇఒ రమాదేవి, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దాలి

- టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఏప్రిల్ 5న శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దాలని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. పేర్కొన్నారు. శనివారం ఆయన కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాంగణమంతా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. లక్షలాదిగా విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కల్యాణం రోజున అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ, తలంబ్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆలయం, పరిసర ప్రాంతాలలో తగినన్ని తాత్కాలిక, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి కల్యాణ వేదిక, ముఖ్యమంత్రి విడిది చేసే భవనం, ఆలయ పరిసరాలు, పుష్కరిణి, వాహన మండపం, అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిటిడి సిఇ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ కుమార్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి అధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇఒ వీరబ్రహ్మం

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

భూ కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదల ఇళ్ల మునకకు కారణమైన భూ కబ్జాదారుడు సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా అమ్మచెరువుమిట్ట వెనుక వైపున ఉన్న బృందావనం కాలనీలో ఇళ్లు మునిగిపోయిన ప్రాంతాల్ని శనివారం సిపిఎం బృందం పర్యటించి సమస్యలు తెలుసుకుంది. మదనపల్లె తహశీల్దార్, ఆర్‌డిఒలకు ఫోన్ ద్వారా ఇళ్ల మునకపై సమాచారం అందించి, బాదితులను ఆదుకోవాలని, భూ కబ్జాలకు పాల్పడిన సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కోళ్లబైలు రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 671, 539, 529, 531 సర్వే నంబర్లలో భూములు కబ్జాకు పాల్పడుతున్న సుధాకర్‌రెడ్డి, రోడ్డు ఏర్పాటు చేసే పేరుతో ఎత్తుగా చదును చేసుకోవడం కారణంగా బృందావనం కాలనీ లోతట్టు ప్రాంతంగా మారిందని తెలిపారు. ఈ కారణంతోనే శుక్రవారం పడిన కొద్దిపాటి వర్షానికి ఇళ్లలోకి నీళ్లు చేరిపోయి పేదల తీవ్రమైన అవస్థలు పడ్డారన్నారు. కబ్జాలు అరికట్టి ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకే వంత పాడటం శోచనీయమన్నారు. ఇళ్లు మునిగిపోయి అవస్థలు పడుతున్న పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు గానీ, ప్రభుత్వ పెద్దలు గానీ ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ భూకబ్జాలకు చట్టబద్ధం చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు స్పందించి అకాల వర్షానికి నష్టపోయిన పేదలను ఆదుకోవాలని, ఇందుకు కారణమైన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ స్థానిక ప్రజలు ఆబిద్, ధనంజయ, నందిని, రమణ, ఖాదర్ పాల్గొన్నారు.

రేపు అంగన్వాడీల చలో విజయవాడ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నామని, కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి. భాగ్యలక్ష్మి, రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ పేర్కొన్నారు. శనివారం చలో విజయవాడకు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌కు ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షల వేతనంతో కూడిన సెలవులు, సగం వేతనంతో కూడిన పెన్షన్ , కనీసవేతనం రూ. 26 వేలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా, సంక్షేమ పథకాల అమలు చేయాలని, ప్రమోషన్‌లలో రాజకీయ జోక్యం నివారించాలని, హెల్పర్లకు వయో పరిమితి 50 సంవత్సరాల వరకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తనిఖీల పేరుతో వేధింపులు అరికట్టాలని తదితర డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు విజయమ్మ జయమ్మ, సుమలత, అనిత, స్వప్న పాల్గొన్నారు.

రైతులను ముంచిన వడగండ్ల వర్షం

రాచవేటివారి పల్లెలో విరిగిన అల్లనేరేడు చెట్లు

- లబోదిబోమంటున్న ఉద్యాన పంటల రైతులు
- 142 ఎకరాలకు పైగా దెబ్బతిన్న పంటలు
- నేలకొరిగిన మామిడి, అల్లనేరేడు, బొప్పాయి చెట్లు
- గాలి బీభత్సానికి నేలమట్టమైన టమోటా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రెండు రోజులుగా తీవ్ర గాలులు, వడగండ్ల వర్షం ప్రభావంతో మండ లంలోని ఉద్యానవన పంటల రైతులు పంటలను నష్టపోయి ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర గాలులు, వడగండ్లు సృష్టించిన బీభత్సానికి మండలంలోని రాచవేటివారిపల్లి, వెంగంవారిపల్లి, రెడ్డివారిపల్లి, నిమ్మనపల్లి గ్రామాలలో ఉద్యానవన పంటలను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పడమటి మండలాలలో ప్రధాన పంటలైన టమోటా, మామిడి, బొప్పాయ, అల్లనేరేడు వంటి ఉద్యాన పంటలు ప్రస్తుతం పూత, పిందే దశలో ఉండటంతో గురు, శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షం ప్రభావంతో చెట్లు విరిగి నేలమట్టం కావడంతో రైతులు లబోదిబో మంటున్నారు. అప్పులు చేసి పంటలను సాగు చేయటంతో, పూత, పిందె దశలోని పంటను ఒక్కసారిగా నష్టపోవటంతో రైతులు నష్టాల ఊబిలోకి కూరికి పోయారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించి తమను ఆదుకోవాలంటూ ఉద్యానవన పంటల రైతులు ప్రభుత్వం వైపు ఎదురుచూస్తున్నారు.

142 ఎకరాలల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

మండల పరిధిలో 142 ఎకరాలకు పైగా ఉద్యానవన పంటలు తీవ్ర గాలులు, వడగళ్లతో కూడిన అకాల వర్ష ప్రభావానికి చెట్లు విరిగి, పిందెలు రాలి, టమోటా మొక్కలు గాలికి కొట్టుకుపోవటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. టమోటా 102 ఎకరాలు, బొప్పాయి 10, మామిడి 17, అల్లనేరేడు ఎకరా, బెండ 3, బీర 2, దోస కర్బూజ 6, కాకర ఒక ఎకరాలో నష్టం వాటిలింది. పంట దిగుబడి దశలో ఉన్న సమయంలో అకాల వర్షం కారణంగా పంట నష్టం వాటిల్లడంతో రైతులు కోలుకోలేని దుస్థితిలోకి వెళ్లిపోయారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అకాల వర్షం కారణంగా నష్టపోయిన ఉద్యానవన పంటల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలి. అప్పులు చేసి పంటలను సాగు చేయటంతో అకాల వర్షం కారణంగా దిగుబడి దశలోనే ఉద్యానవన పంటలు నేలమట్టం కావడంతో తీవ్రంగా నష్టపోయాం. పంట నష్టాన్ని గుర్తించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

- అక్కల రమణారెడ్డి, రైతు, రాచవేటివారిపల్లి

ప్రభుత్వం దృష్టికి పంట నష్టం

మండలంలో అకాల వర్షంతో దెబ్బతిన్న పంట నష్టం వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రధానంగా వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యానవన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రెండు రోజులగా గాలి, వాన, వడగళ్ల బీభత్సం, అకాల వర్షం ప్రభావంతో మామిడి, టమోటా, బొప్పాయ, అల్లనేరేడు, బీర, బెండ వంటి పంటలకు 142 ఎకరాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తించాం. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ నష్టం వాటిల్లిన పంటలను గుర్తించి, పూర్తి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి కృషి చేస్తాం.

- ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి. నిమ్మనపల్లి.



నేల వాలిన బీర తోట

215 ఎకరాల్లో పంటలకు నష్టం

మదనపల్లె అర్బన్ : నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాలకు, వడగండ్లు తోడవడంతో 215 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లింది. వడగండ్ల వర్షానికి సుమారు 195 ఎకరాల్లో టమోటా, 10 ఎకరాల్లో అల్లనేరేడు, 8 ఎక రాల్లో మామిడి, 5 ఎకరాల్లో కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పెద్దఎత్తున గాలి వాన కురడం, వడగండ్లు పడటంతో పూలు, పండ్లు తోటలు, దెబ్బతిన్నాయి. మదనపల్లి పట్టణంలోనూ పెద్ద ఎత్తున రెండు రోజులు వడగళ్లు వర్షం తీవ్ర ప్రభావం చూపించింది. వర్షానికి చింతకాయలు నేలరాలాయి. పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించి, రైతులకు ఆర్థిక సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఉద్యానవన అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

వరద బాధితులను ఆదుకున్న ప్రభుత్వం :'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

2021 నవంబర్‌లో జవాద్ తుఫాన్ కారణంగా నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకున్నదని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. అన్నమయ్య డ్యాం తెగిపోవడం వలన నిరాశ్రయులైన ఆరు కుటుంబాల వారికి ఎపిఎండిసిలో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో మేడా, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది మండలలోని అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి మృతిచెందిన బాధిత కుటుంబాలకు ఊరట లభించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం బాదిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందని తెలియజేశారు. కార్యక్రమంలో కడప జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ యోగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ జగన్ మోహన్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వీరబల్లి మండలం ఎంపిపి రాఘవేంద్రరెడ్డి, వార్డు కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, దాసరి పెంచలయ్య, పులపుత్తూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

కవితశ్రీకి సుజన సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పలమనేరుకు చెందిన కవి, రచయిత దివంగత కరణం శేషుపిళ్లై జ్ఞాపకార్థం, సాహిత్య రంగంలో సేవ చేసే సృజనకారులకు అందించే సుజన సాహితి పురస్కారానికి ఈ సంవత్సరం ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ కవితశ్రీ ఎంపికయ్యారని పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, కార్యవర్గ సభ్యులు కె.సాయి, యుగంధర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగే సాహిత్య కార్యక్రమంలో పురస్కార గ్రహీతకు రూ.ఐదువేల నగదు పురస్కారం అందజేసి, మొమెంటో శాలువాతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వాయల్పాడు(వాల్మీకిపురం) డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కవితశ్రీ(డేరంగుల శ్రీనివాసులు అసలు పేరు)కి గంగవరం కళాక్షేత్రంలో జరిగే సాహితీ కార్యక్రమంలో సుజన సాహితీ పురస్కారాన్ని అందజేయనున్నట్లు వారు తెలిపారు. కవితశ్రీ వెలువరించిన 'ఇచట దుమ్ము దులపబడును' సాహిత్య విమర్శా సంపుటి సాహితీ విశ్లేషకుల ప్రశంసలను అందుకుందని తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, ప్రముఖ అవధాని ఆముదాల మురళి ప్రదానం చేసినట్లు తెలిపారు.

చెంపపెట్టు!

ప్రజా'దృష్టి'

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసిపికి చెంపపెట్టును తలపించాయని చెప్పవచ్చు. ఈ నెల 13న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ఉపాధ్యాయ, పట్టభద్ర స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో అధికార వైసిపి మద్దతు పొందిన అభ్యర్థులు ఓటర్ల జాబితా దగ్గర నుంచి ఓటింగ్ దశ వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి,రామచంద్రారెడ్డి సాధించిన విజయం మెల్లకన్ను లొట్టబోయిన పరిస్థితి తలెత్తింది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్సీ మద్దతుదారు బి.రామగోపాల్‌రెడ్డి మంచి మెజార్టీతో గెలుపొందనుండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎటువంటి ప్రలోభాలకు గురిచేయకుండా స్వచ్ఛందంగా ప్రజలు ఆదరించిన వైనం చర్చనీయాంశంగా మారింది. అధికార వైసిపి సర్కారు తన ఐదేళ్ల కాలవధిలో సంక్షేమం పేరుతో అభివృద్ధిని, యువత ఆకాంక్షలను విస్మరించిన ఫలితం అధికార వైసిపి వ్యతిరేకతను మూట గట్టుకోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమాలను జోడెద్దులుగా సాగించాల్సి ఉండగా, సంక్షేమాన్ని అజెండాగా మార్చుకుని సాగిన పాలనకు మేథావులు, పట్టభద్రులు హర్షించలేదని తేలిపోయింది. రాయలసీమలో నిర్మాణాత్మకమైన అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, సిఎం సొంత జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దగ్గర నుంచి రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ హామీ అమలు హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారడం తెలిసిందే. మేథావులు వైఖరి తేటతెల్లమైన నేపథ్యంలో అధికార వైసిపి మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాస్తవానికి రాజకీయ పార్టీలు మేథావులకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలి. దురదృష్టవశాత్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తెరవెనక నిలుస్తుండడంతో రాజ్యాంగ నిర్మాతల లక్ష్యం దెబ్బతింటోంది. పార్లమెంట్, శాసనసభల్లో మెజార్టీ పేరుతో మందబలం కలిగి అధికార పార్టీలు ఇష్టారాజ్యంగా చట్టాలు చేస్తుండడం వర్తమానంలో అనుభ వైద్యేకమే. ఇటువంటి చట్టాలను మేధావుల పేరుతో గెలుపొందిన ఎమ్మెల్సీలు మేథోపరమైన అవగాహనతో పరిశీలించి లోపాల్ని సవరించడానికి అవకాశాల్ని కల్పిస్తోంది. ఫలితంగా సమాజానికి హితకరమైన చట్టాలను రూపకల్పన చేయడం పరిపాటి. ఇటీవలి కాలంలో ఇటువంటి వివేకవంతులు సైతం రాజకీయ పార్టీల ప్రాపకంతో గెలుపొందుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. పార్లమెంట్, శాసనసభల్లో పెద్దలసభ, మండలి స్థానాల పేరుతో శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులుగా ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులను ఎంపిక అవుతుండడం తెలిసిందే. మేథావుల స్థానాల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు సైతం అధికార పార్టీలకు అడుగులకు మడుగులొత్తుతూ ప్రయివేటు, కార్పొరేట్ సేవల భజనలో మునిగిపోయాయి. దేశంలో ఇటువంటి క్లిష్టపరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మేథావుల స్థానాల్లో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు వివేకం, విచక్షణను కనబరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



తవళం గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిపిఒ

చెత్త నుంచి సంపదను సృష్టించాలి : డిపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని సంపద తయారీ కేంద్రాలను జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి ధనలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంపద తయారీ కేంద్రాల నుంచి పంచాయతీలు అభివృద్ధికి సంపదను సృష్టించాలని ఎంపిడిఒ లీలామాధవి, పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా క్లాప్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో తవళం గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. ప్రతిరోజు ప్రతి గ్రామంలోని పల్లె నుంచి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి ఎరువును తయారు చేయాలన్నారు. తయారుచేసిన ఎరువును గ్రామంలోని రైతులకు విక్రయించి, వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించాలని తెలిపారు. అనంతరం తవళం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికలను, పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయాల నుంచి సేవలను పెంచాలని, ప్రజలతో సఖ్యతగా ఉద్యోగస్తులు మెలగాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, ఎంపిడిఒ లీలామాధవి, పంచాయతీ కార్యదర్శి వెంకట రమణరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

22న మంచాలమ్మతల్లి తిరుణాల

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు గ్రామంలోని మంచాలమ్మతల్లి ఆలయంలో ఈనెల 22వ తేది నుండి అమ్మవారి తిరుణాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, నందలూరు భాస్కర్ రెడ్డి, నారపురెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న మంగళవారం మంచాలమ్మ తల్లికి కుంకుమార్చన, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. 23న ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం, అనంతరం వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని అన్నారు. మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషివిజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి కెవికె సమన్వయకర్త డాక్టర్ జి.ఎస్.పాండురంగ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వారి ఆహారంలో చిరు ధాన్యాలను చేర్చాలన్నారు. చిరుధాన్యాల పంటలు పండించడానికి నీటి వనరులు, ఎరువులు తక్కువగా అవసరమవుతాయని వివరించారు. సేంద్రియ పద్ధతుల ద్వారా చిరుధాన్యాలను పండించవచ్చునని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఐ.జ్యోతి మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు వంటి ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు అధిగమించడానికి చిరుధాన్యాలు వాడటం తప్పనిసరి అన్నారు. చిరుధాన్యాల లో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-కలికిరి

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయాలని డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలికిరి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ఆక్షేపాలకు పాల్పడకుండా ఉండేందుకు ఎన్నికల కమిషన్ ప్రవేశ నియమ నిబంధనలో భాగంగా ఈ నెల 25వ తేదీలోగా మండలంలో ఓటర్ కార్డులకు వారి ఆధార్‌తో అనుసంధానం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ భాగ్యలత, రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఒలు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డి.జాకీర్‌హుస్సేన్

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-గాలివీడు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి విజయాన్ని సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి డి.జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌సి1 బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇష్టంతో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలన్నారు. రికార్డులను తనిఖీ చేసి, వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఒ రవీంద్ర నాయక్, రవిబాబు వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలు : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ఉత్తమ విద్యతో విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలను అధిరోహించవచ్చని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఉన్నతమైన ఆశయాలతో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి విద్యను అభ్యసించినప్పుడే పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వస్తాయని అన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు భయపడకుండా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక సమావేశ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని పంచాలమర్రిలో శనివారం సామాజిక సమావేశ భవనం ప్రారంభించారు. చిన్న వెంకటరమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లోకేశ్వర్ రెడ్డి, హర్షిత దంపతులు గ్రామస్తుల కోరిక మేరకు శిథిలావస్థలో ఉన్న సమావేశపు భవనాన్ని సుమారు రూ.3లక్షలతో సొంత నిధులు ఖర్చు చేసి పునర్నిర్మాణం చేశారు.

వృద్ధులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో లయన్ డాక్టర్ రెడ్డికీర్తి, లయన్ డాక్టర్ ఖదీర్‌బాష ఆర్థిక సౌజన్యంతో బండపల్లె పంచాయతీలోని ప్రేమాలయం వృద్ధాశ్రమం వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నేషనల్ ఓవర్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం ఆశ్రమంలో ఉండే వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించి, దంతాలకు సంబంధించిన జాగ్రత్తలను వివరించినట్లు అధ్యక్షులు షేక్ మహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా దంత వైద్యులు మాట్లాడుతూ ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నేషనల్ ఓవర్ హెల్త్ ప్రోగ్రాం లో భాగంగా ప్రేమాలయం ఆశ్రమంలో వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.నోటి ఆరోగ్య సూత్రాలు, చిగుళ్ళు, దంతాలు ఆరోగ్యంగా ఉండేందుకు సూత్రాలు, నోటి శుభ్రతకు డ్రెస్సింగ్ టెక్నిక్, నోటి క్యాన్సర్ కు గల కారణాలను క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం వారికి టూత్ పేస్టు, బ్రష్‌లను అందించామని తెలిపారు. ప్రపంచ జనాభాలో 90శాతం మంది తమ జీవిత కాలంలో నోటి సంబంధ వ్యాధులతో బాధ పడుతున్నారని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, నీళ్ల అధిక మోతాదులో తీసుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ద్వారా రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యకమాలు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్, నేతి రామ్మోహన్, అఖిల్ ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు. **కలికిరి :** నోటి కేన్సర్ రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పుష్పలత తెలిపారు. నేషనల్ వరల్డ్ హెల్త్‌డేను పురస్కరించుకుని మహల్ సిహెచ్‌సి డాక్టర్ కిరణ్ కుమార్, కలికిరి సిహెచ్‌సి, డిఎఎస్ వైద్య అధికారిని మహి జెబీతాజ్, మహల్ సిహెచ్‌సి డిఎఎస్, వైద్య అధికారిని సుభాషిణిల ఆధ్వర్యంలో కెరెడ్డివారిపల్లి గ్రామంలో ఉన్న సర్వోదయ వృద్ధుల ఆశ్రమంలో నేషనల్ వరల్డ్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలామంది పాన్ పరాగ్, గుట్కా లాంటి మాదకద్రవ్యాలను కూడా నములుతూ ఉంటారని, ఇవి నలమడం వల్ల నోటి కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అనంతరం సరోదయ వృద్ధాప్యం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు నోటి దుర్వాసన రాకుండా ఉండడానికి, ఆర్‌గార్డ్ లిక్విడ్‌ను, బ్రష్, టూత్ పేస్ట్ ను, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం : వృద్ధులకు పేస్టు, బ్రష్‌లను పంపిణీ చేస్తున్న దంత వైద్యులు

ఈ తీర్పు సార్వత్రిక ఎన్నికలకు నాంది : 'బత్యాల'

రాజంపేట : సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :

ప్రజలు నీతికి ధర్మానికే పట్టం కట్టారని, ఈ ప్రజా తీర్పు రానున్న సార్వత్రిక ఎన్నికలకు నాంది అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడు తెలియజేశారు. శాసనమండలి ఎన్నికలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల విజయంతో కలిపి టిడిపి అత్యధిక మెజారిటీతో మూడు స్థానాల్లో విజయం సాధించడంతో బత్యాల చెంగల్రాయుడు ఆధ్వర్యంలో శనివారం తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కలలుగన్న మూడు రాజధానుల ముచ్చట టిడిపి సాధించిన మూడు శాసనమండలి విజయంతో బంగాళాఖాతంలో కలిసిపోయిందని అన్నారు. అధికార పార్టీ ధనహంకారానికి, దౌర్జన్యాలకు లొంగకుండా ప్రజలు నీతి, నిజాయితీకి పట్టం కట్టారని తెలిపారు. 2024లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రానున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో టిడిపి పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అధిక మెజారిటీతో గెలుపొందడంతో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టభద్రులు సత్తా ఏంటో ఎన్నికల్లో చూపించారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సుబ్బరాయుడు, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, బిసి సెల్ పార్లమెంట్ కార్య నిర్వాహ కార్యదర్శి చుక్క యనాది, నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గుండు సురేష్, తాటి సుబ్బరాయుడు, చామంతి పెంచలయ్య, మేస్త్రి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. **ములకలచెరువు :** టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచెర్ల శ్రీకాంత్ భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశవులు, కట్టా హరి, సుధాకర్నాయుడు(జెసిబి), సురేంద్రనాయుడు, కెవి. రమణ, చెన్నక్రిష్ణ, రమణప్ప, మూత్తుకూరు మౌలా, రామాంజులు, వెంకటస్వామి. రమణారెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** తూర్పు రాయలసీమ (ఉమ్మడి చిత్తూరు-ప్రకాశం-నెల్లూరు) జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ 34,110 ఓట్ల మెజారిటీతో అధికార వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిపై ఘనవిజయం సాధించారు. శనివారం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేష్ చిత్తూరులో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. **రామాపురం :** రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి హవా కొనసాగిందని మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు నాగభూషణ్‌రెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, సహదేవరెడ్డి, ఆంజనేయ రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **రాయచోటి :** పట్టభద్రుల పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ లో భూమిరెడ్డి రాంగోపాల్ గెలవడంపై టిటిడి బోర్డు మెంబర్ సుగువాసి ప్రసాద్‌బాబు సంబరాలు చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కటారి శివ, టిడిపి నాయకులు మన్నెర రామాంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి పట్టభద్రులు బుద్ధి చెప్పారని మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్ఆర్ స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టుబద్రులు, తూర్పు రాయలసీమ పట్టభద్రులు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు వైసిపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు నాంది పలికారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, ఇస్మాయిల్, మంజూరు బాషా, రవిశంకర్ రెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు. **రాయచోటి :** 2024 సంవత్సరంలో ఎన్నికలకు ఎన్నికలు ఫలితాలు నిదర్శనమని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ108 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే ఎలాంటి ఫలితాలు వచ్చాయో తెలుసుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వంపై విద్యావంతులకు ఎంత వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో మాజీ జడ్‌పిటిసి నర్సారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రెడ్డియాదవ్, రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి సుబ్బరాజు, ఖాదర్ భాషా, నూరు ఎకరాల రంగారెడ్డి పాల్గొన్నారు.

'మిట్స్'లో 'టోటల్ స్టేషన్ సర్వేపై' జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు "టోటల్ స్టేషన్ సర్వే" పై వర్క్ షాప్ ను జాతీయ స్థాయి లో విద్యార్థులకు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్ గా టి. చందు, డిజిటల్ ల్యాండ్ సెర్వెయర్, తిరుపతి డాక్టర్ బాలమురుగన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వారు పాల్గొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో టి.చందు మాట్లాడుతూ ఆటోకాడ్ డేటాపై టోటల్ స్టేషన్‌ని ఉపయోగించి ల్యాండ్ సర్వేయింగ్ చేసే విధానాలను వివరించారు. డాక్టర్ బాలమురుగన్ మాట్లాడుతూ ఒక సాధారణ టోటల్ స్టేషన్ దాదాపు 3-5 కిలోమీటర్ల వరకు దూరాలను కొలవగలదని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఈ టెక్నాలజీ పై అవగాహన పెంచుకోవాలని, వీటిపై సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమాన్నీ అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, సౌత్ ఇండియన్ స్టూడెంట్ చాప్టర్ వారి ఆధ్వర్యం లో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి దీపాంకర్ రాయ్, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఏప్రిల్ మాసంలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పెద్ద కారంపల్లి గ్రామపంచాయతీలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రవాసాంధ్రులు కెకె.రెడ్డి సహకారంతో పరీక్షా సామగ్రిని ఆయన తల్లి మన్నూరు రామలక్ష్మమ్మ చేతుల మీదుగా అందజేశారు. జడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ పేద పిల్లల విద్యాభివృద్ధికి కెకె.రెడ్డి చేస్తున్న సహాయం అభినందనీయమన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తన వంతు సహాయంగా నిరంతర సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చొప్ప ఎల్లారెడ్డి, పెంచలయ్య, మన్నూరు నారాయణరెడ్డి, ఎంజిపురం ఎంపిటిసి మధుబాబు, బాబు, శివరామిరెడ్డి, మిరియాల సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ప్రారంభమైన టెక్ మారథాన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నుంచి టెక్ మారథాన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని, 500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని మూడు రోజులలో భాగంగా తొలుత ఒకటిన్నర రోజు శిక్షణ, మిగిలిన ఒకటిన్నర రోజు శిక్షణలో నేర్చుకున్న మెళుకవలు మీద వారిని పరీక్షించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ బ్రిడ్జి డైరెక్టర్ యుక్తేష్ మాట్లాడుతూ మూడు రోజులు జరిగే కార్యక్రమాలను టెక్నికల్ బూట్ క్యాంప్ (ఒకటిన్నర రోజు శిక్షణ), టెక్ మారథాన్ (ఇచ్చిన శిక్షణపై24 గంటలపాటు పరీక్ష) అనే రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. టెక్ బూట్ క్యాంపు ఆధారంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మిషన్ లర్నింగ్, డేటా అనలైటిక్స్ అనే అంశాలపై ఒకటిన్నర రోజు పాటు శిక్షణ ఇచ్చి , మరో ఒకటిన్నర రోజు టెక్ మారథాన్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పై కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలపై విద్యార్థులు టూరిజం, స్మార్ట్ వెహికల్, ట్రాన్స్ పోర్టేషన్ అండ్ లాజిస్టిక్, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్, స్మార్ట్ ఎడ్యుకేషన్, డిజాస్టర్ మేనేజ్ మెంట్, అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్, రెన్యువబుల్ ఎనర్జీస్ అండ్ మిడీ టెక్, బయోటెక్లలో ప్రతిక్షేపించి అప్లికేషన్స్ ను అభివృద్ధిపరిచి, ప్రెజెంటేషన్ ఇచ్చిన వంద గ్రూపుల నుంచి పది గ్రూపులను ఎంపిక చేసి అనంతరం వారికి మరలా పోటీలు నిర్వహించి మొదటి మూడు బహుతులను ప్రకటిస్తామని కో-ఆర్డినేటర్ ఎస్ మహ్మద్ రఫీ తెలిపారు.

రామాయణ సప్తాహం కరపత్రం ఆవిష్కరణ

రాజంపేట అర్బన్ : టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఉగాది నుంచి ఎనిమిది రోజులపాటు నిర్వహించే రామాయణ సప్తాహం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో విడుదల చేశారు. ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు, ఆలయ ప్రధాన అర్చకులు యతిరాజం హరినాధ శర్మ, భగవాన్ గీతా సేవా సత్సంగం కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, శ్రీవారిభక్త సేవాసమితి అధ్యక్షులు రఘునాథ్, బద్వేలు సుబ్బరాయుడు, చలువాది రంగస్వామి, అచ్యుత, రామ సుబ్బమ్మ, మహేశ్వరమ్మ, శ్రీదేవి, సుభాషిణి తదితర గీతా సేవా సత్సంగం పారాయణ భక్తులు ఈ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగనపల్లి వెంకటరమణ, కొత్త నరసింహులు మాట్లాడుతూ రామాయణ సప్తాహం కార్యక్రమాలకు భక్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం తనిఖీ

కలకడ : వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డిపిఒ మునీశ్వర తనిఖీలు నిర్వహించారు. శనివారం మండలంలోని కోన, నడిమిచెర్ల, కదిరాయచెరువు పంచాయితీ బొంతలవారిపల్లి, ఎర్రకోటపల్లి పంచాయతీ సింగనొడ్డుపల్లి, గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్, మాతా శిశు సంరక్షణకార్డ్స్, ఎంఎల్‌హెచ్‌పిల స్టాక్ రిజిస్టరు, పర్మినెంట్ ఆర్టికల్ రిజిస్టర్ తనిఖీ నిర్వహించారన్నారు. ఆదేశించారు. కార్యక్రమములో వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఎంపిహెచ్ఇఒలు జయరామయ్య, వెంకటేష్, పిహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్వైజర్లు వెంకటేశ్వర రావు, ముజీబ్ బాష, ఎఎన్ఎంలు వాణి, శ్రీలక్ష్మి, నాగజ్యోతి,రాజేశ్వరి ఆశాలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'గేట్'లో కెఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

గేట్ (గ్రాడ్యుయేట్ ఆటిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ 2023) ఫలితాల్లో కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (2017-21) బ్యాచ్ పూర్వ విద్యార్థిని వి. భావన అనే విద్యార్థిని ఆల్ ఇండియా 42 వ ర్యాంక్, ప్రస్తుతం బి.టెక్ సివిల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఏస్. వి. సాయి పవన్ అనే విద్యార్థి 11,847 ర్యాంక్ , మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న పి.ఒ. వంశీధర్ అనే విద్యార్థి 15,189 ర్యాంక్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ చార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన వి.భావన మాట్లాడుతూ మొదటి నుంచి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, సమగ్ర ప్లానింగ్, క్రమశిక్షణతో కళాశాల వనరులు ఉపయోగించుకుని అధ్యాపకులు అందించిన గైడెన్స్ ద్వారా తాను ర్యాంకు సాధించానని చెప్పారు. మరొక విద్యార్థి ఎస్.వి.సాయి పవన్ (సివిల్ ఇంజనీరింగ్)మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం కళాశాల అధ్యాపకులు మార్గదర్శకాలు, మెలకువలు పాటించి సన్నద్ధమయ్యానని చెప్పారు. ఎన్ఐటిలో చేరి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆలిండియా లెవెల్లో గేట్‌లో తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ర్యాంకులు సాధించడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) విద్యార్థి, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

జడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన ప్రిన్సిపల్ కార్యదర్శి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ, ప్రధానోపాధ్యాయుడు, క్లాస్ టీచర్, ఇంగ్లీష్ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 7వ తరగతి విద్యార్థులు 20 మంది షర్టు ధరించకుండా బడికి రావడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు విద్యార్థుల యూనిఫామ్ అందిస్తోందని, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యార్థులు యూనిఫాం ధరించకుండా హాజరవుతున్నారని అన్నారు. ఏడవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠంలో అడిగిన ప్రశ్నలకు కూడా సరిగ్గా సమాధానాలు చెప్పకపోవడంతో ఎంఇఒ, హెచ్ఎం, ఇంగ్లీష్ టీచర్, క్లాస్ టీచర్లకు షోకాస్ నోటీసులు ఇవ్వాలని డిఇఒ పురుషోత్తంను ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫరూక్ ఖాన్ మాట్లాడుతూ యూనిఫాం సైజుల్లో తేడా ఉండడంతో విద్యార్థులు వాటిని తొడగడం లేదని సమాధానం ఇచ్చారు. అందుకు ప్రిన్సిపల్ కార్యదర్శి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో కడప, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖాధికారులు రాఘవరెడ్డి, పురుషోత్తం, సమగ్రశిక్ష చంద్రశేఖర్, ఎంఇఒలు కరుణాకర్, బాలాజీనాయక్, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.54.42 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు గ్రామ పంచాయతీకి శనివారం నిర్వహించిన వేలంలో రూ.54.42 లక్షలు ఆదాయం సమకూరిందని రాయచోటి డిఎల్‌పిఒ నారాయణ పేర్కొన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన వేలంపాటకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి జరగాలంటే ఇంటిపన్ను, నీటిపన్ను ప్రజలు పంచాయతీకి చెల్లించాలన్నారు. మురికి కాలవల్లో మురుగునీరు లేకుండా, రోడ్డుపై చెత్త లేకుండా, ప్రతి వీధికి తాగునీరు అందించేందుకు, ప్రతివీధిలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. బస్టాండ్ గేటు రూ.8.80లక్షలు, కూరగాయలసంత గేటు రూ.15.50లక్షలు, గొర్ల సంత రూ.30.11లక్షలు, మూడు గేట్లను నాయనవారిపల్లి చెందిన కె.బాలప్ప నాయుడు కైవసం చేసుకున్నాడు. 2023-24 ఏప్రిల్1 నుంచి మార్చి 31వ తేదీ వరకు పంచాయతీ గేట్ వసూలు చేసుకునే అధికారం ఆయనకు కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ రెడ్డి, ఎంపిడిఒ శేఖర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, వేలంపాటదారులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో సేవలందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు సకాలంలో అందించాలని డిఎల్‌డిఒ లక్ష్మీపతి కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ప్రతి ఒక్క గ్రామ సచివాలయ డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్ లతో గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను గుర్తించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు గుర్తించి వెంటనే పనులు ప్రారంభించేందుకు చొరవ చూపాలన్నారు . సమావేశంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్ ,హౌసింగ్ డిఇ శ్రీహరి పాల్గొన్నారు.

నూతన ఆలయానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని పెద్ద కారంపల్లి పంచాయతీ అరుంధతి వాడలో శనివారం నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి భూమిపూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, వీరబల్లి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవస్థానమునకు, వేద పండితుల చేత పూజా కార్యక్రమంతో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మన్నూరు రామలక్ష్మమ్మ, వెంకటసుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, వైసిపి నాయకులు చొప్ప ఎల్లారెడ్డి, దాసరి పెంచలయ్య, ఎంపిటిసి మధుబాబు, మిరియాల సురేఖ, బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి : విసి

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని అనంతపూర్ జెఎన్‌టియు యూనివర్సిటీ విసి రంగజనార్ధన్ సూచించారు. జెఎన్‌టియు కలికిరి సాంకేతిక కళాశాల దశాబ్ది ఉత్సవాలు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్‌వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జి.రంగజనార్ధన్, సభాధ్యక్షులుగా జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్‌వి.సత్యనారాయణ, ప్రొఫెసర్ దేవకుమార్, సిఇఒ బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఎపి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుభాష్, కన్వీనర్ షేక్ నషీరా వివిధ శాఖధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. విసి మాట్లాడుతూ ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. సమాజానికి తిరిగి ఇచ్చే ధోరణిని అలవర్చుకోవాలన్నారు. హార్డ్ వర్డ్ యూనివర్సిటీకి వారి పూర్వ విద్యార్థులు చేసే సాయం మన భారతదేశం విద్యపై వెచ్చించే ధనం కంటే ఎక్కువ అని తెలిపారు. అంతర్జాతీయ చదరంగా క్రీడాకారిణి సంధ్యా గోలి, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, డిఆర్‌డిఒ చైర్మన్ సతీష్ రెడ్డి, అనంతపురం పూర్వ విద్యార్థులని చాలావరకు ప్రముఖ విద్యాసంస్థల వెనుక బలమైన పూర్వపు విద్యార్థులు ఉన్నారన్నారు. ఆర్థిక సహాయం అందించ లేకపోయినా ఉద్యోగాలు సమకూర్చడం, మార్గనిర్దేశం చేయడం ద్వారా ఇప్పటి విద్యార్థులకు తోడ్పడాలని అన్నారు. పూర్వపు విద్యార్థుల సంఘం చిహ్నాన్ని, దశాబ్ద ఉత్సవాల సావనీర్‌ను విడుదల చేశారు.

పూర్వ విద్యార్థుల సావనీర్‌ను విడుదల చేస్తున్న విసి రంగజనార్ధన్, అధ్యాపకులు

క్రైం కార్నర్

ఘర్షణపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పటాన్ వీధిలో కాపురం ఉంటున్న పటాన్ అమానుల్లా ఖాన్ భార్య అఫ్రోజా, అఫ్రోజా చెల్లెలను, అదే వీధిలో కాపురం ఉంటున్న భాను , భాను కుమార్తె షబానా, భాను చిన్నమ్మ మస్తానీ ,భాను తమ్ముడు జహీర్, భాను కుమారుడు జవహర్‌లు కలసి దాడి చేసి రక్త గాయాలు చేయడంపై అఫ్రోజా ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి డిలీట్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.